సాక్షి
ఆదిలాబాద్
సోమవారం । 15 । ఏప్రిల్ । 2024



అకాల వర్షం

తాంసి: తాంసి, భీంపూర్ మండలాల్లో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన అకాల వర్షం కురిసింది. జొన్న, వేరుశనగ, నువ్వ పంటలు నేలవాలాయి.



దీక్షలకు కేరాఫ్ సింగాపూర్

బేల మండలంలోని సిర్సన్న సింగాపూర్ హనుమాన్ ఆలయం హనుమాన్ దీక్షలకు కేరాఫ్‌గా నిలుస్తోంది. 34 ఏళ్లుగా దీక్షల స్వీకరణ కొనసాగుతోంది. 8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
38.0 /27.0

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరగనుంది. ఉక్కపోత ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

జార్జిరెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలి



జార్జిరెడ్డికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం గళమెత్తి పోరాడిన జార్జిరెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో జార్జిరెడ్డి 52వ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. జార్జిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఓయూలో విద్యార్థులపై ఆకతాయిలు చేస్తున్న మూక దాడులపై తిరుగుబాటు చేసిన ధీరయోధుడు కామ్రేడ్ జార్జిరెడ్డి అని గుర్తు చేశారు. కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి కుమ్రం అశోక్, నాయకులు హిరమన్ అర్జున్, అరుణ్, చంద్రభాన్, బాపూరావు, జంగు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి కట్టడిపై ప్రత్యేక దృష్టి



చేతిపంపు పనితీరు పరిశీలిస్తున్న కమిషనర్

కైలాస్‌నగర్: ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ ఎండీ.ఖమర్ అహ్మద్ అన్నారు. పట్టణంలోని ఇందిరమ్మకాలనీ, సుభాష్‌నగర్ కాలనీల్లో ఆదివారం ఆయన పర్యటించారు. మిషన్ భగీరథ నీటి సరఫరా తీరును పరిశీలించారు. కాలనీవాసులతో మాట్లాడి నీటి సరఫరా తీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సుభాష్‌నగర్‌లో కొన్ని ప్రాంతాలకు రోజు విడిచి రోజు, మరికొన్ని ప్రాంతాలకు ప్రతిరోజు మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతుందన్నారు. ఇందిరమ్మకాలనీలో మాత్రం భగీరథ పైప్‌లైన్ వేసినా కనెక్షన్ ఇవ్వకపోవడంతో నీటి సరఫరా కావడం లేదన్నారు. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు. ఆ కాలనీలో ప్రస్తుతం ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నామని తెలిపారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

అగ్ని ప్రమాదాలపై జాగ్రత్తలు పాటించాలి



మౌనం పాటిస్తున్న అధికారులు, సిబ్బంది

ఆదిలాబాద్‌టౌన్: అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని అగ్నిమాపక శాఖ జిల్లా అదనపు అధికారి గోవర్ధన్ రెడ్డి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలను జిల్లా కేంద్రంలోని ఫైర్‌స్టేషన్‌లో ఆదివారం ప్రారంభించారు. ముందుగా అగ్నిమాపక శాఖ జెండా ఆవిష్కరించారు. అమరులైన సిబ్బందిని స్మరిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఆయన మాట్లాడారు. వేసవిలో అగ్నిప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ మేరకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలనేరు. తాగిన సిగరేట్, బీడీలు ఎక్కడపడితే అక్కడ పడేయవద్దని సూచించారు. ఎండత తీవ్రత కారణంగా చెత్తాచెదారం, గడ్డికి మంటలు అంటుకునే అవకాశాలు ఉంటాయని తెలిపారు. అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఈ నెల 20 వరకు వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్‌వో దుర్గే శివాజీ, జమెదార్లు కాంతారావు, ఖదీర్ అహ్మద్, డ్రైవర్లు అనిల్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

శిశు మరణాల నివారణకు సంకల్పం

- పైలెట్ ప్రాజెక్ట్‌గా జిల్లా ఎంపిక
- నవజాత శిశు మరణాలు తగ్గించేందుకు చర్యలు
- ఢిల్లీలోని ఐసీఎంఆర్ సెమినార్‌కు డీఎంహెచ్‌వో
- జిల్లాలో 12.7 శాతం మరణాలు

దేశంలో శిశు మరణాల రేటు : 26.6 శాతం (వెయ్యి మందికి)
రాష్ట్రంలో శిశు మరణాల రేటు: 21 శాతం
జిల్లాలో శిశు మరణాల రేటు: 12.7 శాతం
జిల్లాలో 2022–23లో శిశు మరణాలు: 153
జిల్లాలో 2023–24లో శిశు మరణాలు: 179
రిమ్స్‌లో ఎస్ఆర్‌సీ బెడ్లు: 20
రిమ్స్ ఎస్ఎన్‌సీయూలో ఇంక్యుబేటర్లు: 20
ఉట్నూర్ ఆస్పత్రిలో ఎస్ఆర్‌సీ బెడ్లు: 10
ఉట్నూర్‌లో ఎస్ఎన్‌సీయూలో ఇంక్యుబేటర్లు: 10



డీఐఈసీలో శిశువులను పరీక్షిస్తున్న వైద్యులు (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో నవజాత శిశువులు, ఐదేళ్లలోపు చిన్నారులు పిట్టల్లా రాలుతున్నారు. వీరి మరణాలకు అనేక కారణాలున్నాయి. దేశంలో అత్యధికంగా పది జిల్లాల్లో శిశు మరణాలు సంభవిస్తుండగా, అందులో ఆదిలాబాద్ జిల్లా కూడా ఉంది. ఈ మరణాలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్ (ఐసీఎంఆర్), కేంద్ర వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ శిశు మరణాలపై అధ్యయనం చేస్తుంది. సోమ, మంగళవారాల్లో ఢిల్లీలో నిర్వహించనున్న ఐసీఎంఆర్ సెమినార్‌లో జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి నరేందర్ రాథోడ్ పాల్గొనున్నారు. ఇందులో నిపుణులు నవజాత, శిశు మరణాల రేటు తగ్గించే అంశాలను వివరించనున్నారు. రాష్ట్రం నుంచి ఆదిలాబాద్ జిల్లా పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపికైంది. సెమినార్‌లో తెలిపిన అంశాలపై జిల్లా వైద్యాధికారులతో చర్చించి మరణాల సంఖ్య తగ్గించేలా చర్యలు తీసుకోనున్నారు.

అమ్మకు.. కన్నీళ్లే

నవమాసాలు మోసిన మాతృమూర్తికి కన్నీళ్లే మిగులుతున్నాయి. పుట్టిన బిడ్డ.. అంతలోనే తనువు చాలిస్తుండడంతో చాలా మంది కన్నీటిపర్యంతం అవుతున్నారు. నెలరోజుల్లో నవజాత శిశువులు, ఐదేళ్లలోపు చిన్నారులు దాదాపు 20 మంది కంటే ఎక్కువే మరణిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లోనే నెలలో 15 నుంచి 20 మంది చిన్నారులు మృత్యువాత పడుతున్నారు. ఇందుకు అనేక కారణాలు ఉన్నాయి. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోకపోవడం, రక్తహీనత, వివిధ రకాల రుగ్మతలు, ఐరన్ లోపం తదితర కారణాలతో నవజాత శిశువులు తక్కువ బరువుతో జన్మిస్తున్నారు. వీరిని ఇంక్యుబేటర్‌లో ఉంచి వైద్యసేవలు అందిస్తున్నప్పటికీ 15 నుంచి 20 శాతం వరకు మరణిస్తున్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. శ్వాస సంబంధిత వ్యాధులు, పాలు తాగించే సమయంలో అవి చాతిలోకి వెళ్లడం, గుండె, మెదడు సంబంధిత వ్యాధులతో లోకం చూడకముందే కన్ను మూస్తున్నారు. గర్భిణులు ప్రసవం అయ్యే సమయంలో ఆస్పత్రికి సకాలంలో చేరుకోకపోవడం, ఆయా మండలాల పరిధిలో పీహెచ్‌సీలు ఉన్నప్పటికీ చిల్డ్రన్ స్పెషలిస్టులు లేకపోవడం, మారుమూల గ్రామాల నుంచి జిల్లా కేంద్రానికి వచ్చే సరికి వారి ఆరోగ్యం క్షీణించడం తదితర కారణాలతో మరణాలు సంభవిస్తున్నాయి. చాలా మంది తల్లిదండ్రులకు అవగాహన లేకపోవడం, మూఢనమ్మకాలు, పిల్లలకు ఇన్ఫెక్షన్, పరిశుభ్రత పాటించకపోవడం, వారు మాట్లాడే భాష సమస్య కారణంగా కూడా చిన్నారుల మరణాలు సంభవిస్తున్నాయి.

పైలెట్ ప్రాజెక్ట్ కింద..

రాష్ట్రం నుంచి ఆదిలాబాద్ జిల్లాను పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేశారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్, కేంద్ర వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ శిశు మరణాలపై అధ్యయనం చేస్తుంది. 'సంకల్ప' ప్రాజెక్ట్ పేరిట ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. నవజాత, శిశు మరణాలు తగ్గించేందుకు క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలు, గర్భిణులు పాటించాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు, శిశు గర్భంలోనే మరణించే సందర్భాలు, పుట్టిన తర్వాత ఏ కారణం చేత మరణిస్తున్నారు.. తదితర అంశాలపై ఈనెల 15,16 తేదీల్లో ఢిల్లీలో నిర్వహించనున్న సెమినార్‌లో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి నరేందర్ రాథోడ్ పాల్గొనున్నారు. 12.7 శాతం నుంచి 10 శాతం కంటే తక్కువ మరణాల నివారణకు చర్యలు చేపట్టనున్నారు. పది రాష్ట్రాల్లో ఉత్తర్ ప్రదేశ్‌లోని ఉన్నవ్, వారణాసి, రాజస్తాన్‌లోని డొంగాపూర్, కర్ణాటకలోని పొప్పల్, ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్, బిహార్‌లోని పూర్ణిమ, బెంగళూరులోని ముర్షిదాబాద్, హర్యానలోని అంబాల, మధ్యప్రదేశ్‌లోని కార్గన్, తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా ఎంపికయ్యాయి.



ఇంక్యుబేటర్‌లో ఉన్న శిశువును పరిశీలిస్తున్న డీఐవో వైసీ శ్రీనివాస్ (ఫైల్)

శిశు మరణాలు తగ్గించేందుకు చర్యలు..



శిశు మరణాలు తగ్గించేందుకు చర్యలు చేపడతాం. ఢిల్లీలో ఈనెల 15, 16 తేదీల్లో ఐసీఎంఆర్ నిర్వహించే సెమినార్‌కు హాజరవుతున్నాం. సంకల్పం కార్యక్రమం పేరిట శిశు మరణాల నివారణపై సెమినార్‌లో వివరిస్తారు. అనంతరం జిల్లా వైద్యాధికారులతో సమావేశం నిర్వహించి తగు చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం జిల్లాలో 12.7 శాతం శిశు మరణాల రేటు ఉంది. వాటిని 10 శాతం కంటే తక్కువగా నమోదయ్యేలా చూస్తాం.

– నరేందర్ రాథోడ్, డీఎంహెచ్‌వో

విద్యతోనే బలహీనవర్గాల అభివృద్ధి

- కలెక్టర్ రాజర్షి షా
- అంబేడ్కర్‌కు ఘన నివాళి



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్ ఆలం

ఆదిలాబాద్‌రూరల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ చెప్పినట్లుగా బలహీన వర్గాలు అభివృద్ధి చెందాలంటే విద్యతోనే సాధ్యమని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. దళిత అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో ఎస్పీ గౌస్ ఆలంతో కలిసి పాల్గొన్నారు. ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పంచశీల జెండా ఆవిష్కరించి బౌద్ధ వందనం సమర్పించారు. అలాగే ఆర్టీసీ బస్టాండ్ ఎదుట, పట్టణంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దేశానికి అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, దళిత అభివృద్ధి శాఖ అధికారి సునీతకుమారి, దళిత సంఘాల నాయకులు దుర్గం శేఖర్, రత్న జాడే ప్రజ్ఞకుమార్, రాంచందర్ మహాత్మే, రాజన్న, తదితరులున్నారు.

'గమ్యం'పై అవగాహన



యాప్‌పై అవగాహన కల్పిస్తున్న డీఎం కల్పన

కైలాస్‌నగర్: ప్రయాణికులు గమ్యం యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ కల్పన అన్నారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌తో పాటు పట్టణంలోని సాత్నాల బస్టాండ్ వద్ద ప్రయాణికులకు యాప్‌పై ఆదివారం అవగాహన కల్పించారు. ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించకుండా ఆర్టీసీలోనే ప్రయాణించాలని, మహిళలు మహాలక్ష్మి స్కీంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌డీఐ యూసుఫ్,విలేజ్ బస్ ఆఫీసర్ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీటికి చెక్



క్లోరోస్కోప్ కిట్‌లోని సామగ్రి



జీపీ కార్యదర్శికి క్లోరోస్కోప్ కిట్‌ను అందజేస్తూ..

- జీపీలకు నీటి నాణ్యత కిట్లు
- పరీక్షల తర్వాతే తాగునీటి సరఫరా
- కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణ

కైలాస్‌నగర్: ఇంటింటికీ శుద్ధజలం అందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అమలు చేస్తోంది. అయితే నీటి సరఫరాలో తలెత్తే సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. లీకేజీలు, ట్యాంకుల అపరిశుభ్రత, పైపులైన్లు డ్రైయినేజీల్లో నుంచి ఉండటంతో పలుచోట్ల తాగునీరు కలుషితమవుతుంది. చేతిపంపులు, బోరుబావుల నుంచి నేరుగా సరఫరా చేస్తున్న నీరు నాణ్యత లేక పల్లెల్లో వ్యాధులు ప్రబలుతున్నాయి. దీన్ని గుర్తించిన గ్రామీణ నీటి సరఫరా విభాగం(ఆర్‌డబ్ల్యూఎస్) ప్రత్యేక చర్యలకు శ్రీకారం చుట్టింది. తాగునీటిని పరీక్షించేందుకు గాను ప్రతీ పంచాయతీకి క్లోరోస్కోప్ కిట్లను అందజేసింది. నీటి పరీక్షల నిర్వహణపై కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు.

స్వచ్ఛమైన నీటిని అందించాలనే..

గ్రామాల్లో మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా జరుగుతోంది. అయితే పైపులైన్ లీకేజీలు ఏర్పడి చాలాచోట్ల నీరు కలుషితమవుతున్న సందర్భాలున్నాయి. ఈ క్రమంలో ఏజెన్సీలోని ఆదివాసీలు ఈ నీటిని తాగేందుకు ఇష్టపడటం లేదు. ఈ నేపథ్యంలో మిషన్ భగీరథ అధికారులు ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించేందుకు చర్యలు చేపట్టారు. మిషన్ భగీరథ ద్వారా సరఫరా అయ్యే నీటితో పాటు పల్లెల్లోని తాగునీటి ట్యాంకులు, చేతిపంపులు, బోరుబావుల నీటి నాణ్యతను పరీక్షించనున్నారు. తాగునీటి వనరుల్లోని నీటిని పరీక్షించిన వివరాలను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయనున్నారు. నాణ్యతలో ఏదైనా తేడా అనిపిస్తే వెంటనే మిషన్ భగీరథ అధికారులకు సమాచారం అందిస్తారు. వారు సూచించే వరకు ప్రత్యామ్నాయ వనరుల నుంచి నీటిని అందించాల్సి ఉంటుంది.

ప్రతి జీపీకి క్లోరోస్కోప్ కిట్

నీటి నాణ్యత పరీక్షించేందుకు గాను జిల్లాలోని 468 పంచాయతీలకు జీపీకోటి చొప్పున క్లోరోస్కోప్ కిట్ అందించారు. వీటిని ఉపయోగించి ఏ విధంగా పరీక్షలు నిర్వహించాలి, నాణ్యత గుర్తించడం వంటి అంశాలపై పంచాయతీ కార్యదర్శులకు మిషన్ భగీరథ అధికారులు ప్రత్యేక శిక్షణనిస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు సగం మందికి శిక్షణ పూర్తవగా మిగతా వారికి మరో ఐదారు రోజుల్లో పూర్తిచేస్తామని అధికారులు చెబుతున్నారు.

శుద్ధజలం అందించేందుకే..



గ్రామాల్లో ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతోనే ప్రతీ పంచాయతీకి క్లోరోస్కోప్ కిట్‌ను అందజేశాం. ఏ విధంగా నీటి పరీక్షలు నిర్వహించాలనే దానిపై ఏఈలు పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇస్తున్నారు. నీటి నాణ్యతలో ఏమైనా మార్పు గమనిస్తే వెంటనే మాకు సమాచారమందించాలి. ప్రతి కార్యదర్శి విధిగా నీటి పరీక్షలు చేయాలి. లేకుంటే చర్యలు తప్పవు.

– చంద్రమోహన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, ఆదిలాబాద్

గొర్రెల స్కీం.. లేనట్లే!

- గొల్ల, కుర్మలకు డీడీలు వాపస్
- కసరత్తు చేస్తున్న అధికారులు
- నేటి నుంచి అందజేత షురూ



కైలాస్‌నగర్: గొల్ల, కుర్మల ఆర్థికాభివృద్ధి కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన గొర్రెల పంపిణీ పథకం కథ కంచికి చేరింది. జిల్లాలో గొర్రెల యూనిట్ల కోసం డీడీలు చెల్లించిన వారికి తిరిగి ఇచ్చేయాలని పశు సంవర్ధకశాఖ నిర్ణయించింది. ఈమేరకు ఆ శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. నేటి నుంచి మండలాల వారీగా డీడీలు ఇచ్చే ప్రక్రియ షురూ కానుంది. ఏళ్లు గడుస్తున్నా గొర్రెల యూనిట్లు ఇవ్వకపోవడంతో తమ డీడీలైనా తిరిగిచ్చేయాలని ఎంపికైన లబ్ధిదారులు కొంత కాలంగా అధికారుల చుట్టు తిరుగుతున్న విషయం విదితమే. ఆ శాఖ తాజా నిర్ణయంతో ఎట్టకేలకు వారి తిప్పలు దూరం కానున్నాయి.

జిల్లాలో 5,589 మందికి..

బీఆర్ఎస్ ప్రభుత్వం 2017లో గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రారంభించింది. గ్రామీణ ప్రాథమిక గొర్రెల పెంపకం సహకార సొసైటీల్లో సభ్యులుగా ఉన్న 18 ఏళ్ల పైబడిన వారికి గొర్రెలను అందించింది. తహసీల్దార్, ఎంపీడీవో, మండల పశువైద్యాధికారి సభ్యులతో కూడిన లబ్ధిదారుల ఎంపిక కమిటీని నియమించింది. వీరి ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించి లబ్ధిదారులను ఏ, బీ గ్రూపులుగా లాటరీ ద్వారా ఎంపిక చేశారు. ఏ గ్రూపులో 4,323 మందిని ఎంపిక చేయగా అందులో 4,282 మందికి 2020 సంవత్సరం వరకు గొర్రెలను పంపిణీ చేశారు. 4,337 మందితో బి- లిస్టును తయారు చేయగా అందులో 1,307 మంది లబ్ధిదారులకు ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల వరకు గొర్రెలను పంపిణీ చేశారు. మొత్తంగా రెండు లిస్టుల్లో కలిపి 5,589 మందికి ప్రయోజనం చేకూరింది. రెండో విడతలోని 3,030 మంది మిగిలిపోగా ఇందులో గొర్రెల కోసం 2,341 మంది డీడీలు చెల్లించారు.

రూ.43,750 చొప్పున డీడీ

ఏ గ్రూప్‌లో 41మంది, బి–గ్రూప్‌లో 3030 చొప్పున మిగిలిపోయిన 3,070 మంది గొల్ల, కుర్మలకు గొర్రెలను పంపిణీ చేయాల్సి ఉంది. అయితే ఇందులో 2,341 మంది మాత్రమే గొర్రెల కోసం ప్రభుత్వానికి డబ్బులు చెల్లించారు. 2020 తర్వాత గొర్రెల పంపిణీని నిలిపివేసిన ప్రభుత్వం గతేడాది అసెంబ్లీ ఎన్నికల సమయంలో మరోసారి పంపిణీ ప్రక్రియ చేపట్టింది. ధరలు పెరిగాయనే ఉద్దేశంతో యూనిట్ ధరను రూ.1.75లక్షలకు పెంచుతూ లబ్ధిదారుని వాటాగా రూ.43,750 చెల్లించాలని సూచించారు. అయితే తొలి విడతలో అమలు చేసిన డీడీల విధానానికి స్వస్తి పలికింది. వాటికి బదులుగా అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి యాక్సిస్ బ్యాంకు నుంచి ఆన్‌లైన్ అకౌంట్ నంబర్ కేటాయించింది. దీంతో గొల్ల, కుర్మలు రూ.43,750 చొప్పున ఆ అకౌంట్‌కు తమ వాటా సొమ్మును జమచేశారు. 2,341 మందిలో 597 మందికి గొర్రెలను అందించారు. మరో 1744 మందికి గొర్రెలు ఇవ్వలేదు. దీంతో ప్రభుత్వ తీరుకు విసుగు చెందిన వారు తమకు గొర్రెలనైనా ఇవ్వాలని లేకుంటే తాము కట్టిన డీడీల సొమ్మునైనా వెనక్కివ్వాలంటూ ఆందోళనలు చేపట్టారు. మండలస్థాయిలో ఆందోళనలు నిర్వహించడంతో పాటు కలెక్టర్, ప్రజాప్రతినిధులను కలిసి వేడుకున్నారు.

డీడీల వాపస్‌కు కసరత్తు

ప్రభుత్వం గొర్రెలను ఇచ్చేందుకు ఆసక్తి చూపకపోవడం, జిల్లాలో గొల్ల, కుర్మల నుంచి ఒత్తిళ్లు పెరుగుతున్న నేపథ్యంలో డీడీలు కట్టిన వారికి వాపస్ ఇచ్చేయాలని పశుసంవర్ధక శాఖ ఎట్టకేలకు నిర్ణయించింది. జిల్లాలోని 1744 మందికి సంబంధించిన రూ.7.63కోట్లకు సంబంధించిన డీడీలను తిరిగి ఇచ్చేసేలా ఆ శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. డీడీలను అందించే ప్రక్రియ నేటి నుంచి షురూ కానుంది. మండలాల వారీగా అందించేలా కార్యాచరణ సిద్ధం చేసిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపడుతున్నారు. ఖరారు చేసిన తేదీల్లో జిల్లా కేంద్రంలోని కార్యాలయానికి వచ్చే గొల్ల, కుర్మలకు డీడీలు అందించాలని నిర్ణయించారు.

మండలాల వారీగా డీడీలు చెల్లించిన వారు ఇలా..

మండలం	డీడీలు చెల్లించినవారు
ఆదిలాబాద్ అర్బన్	61
ఆదిలాబాద్ రూరల్	512
మావల	93
బేల	110
జైనథ్	314
తలమడుగు	108
తాంసి	174
సిరికొండ	26
గుడిహత్నూర్	23
నేరడిగొండ	64
బజార్‌హత్నూర్	169
ఇచ్చోడ	38
బోథ్	82
భీంపూర్	484
ఉట్నూర్	54
ఇంద్రవెల్లి	29
నార్నూర్	83
మొత్తం	2,341

జిల్లాలో గొర్రెల పంపిణీకి సంబంధించిన వివరాలు

గొర్రెల పెంపకం సహకార సొసైటీలు	133
ఆయా సొసైటీల్లోని సభ్యులు	8,660
తొలివిడత లబ్ధిదారులు	5,022
రెండో విడత లబ్ధిదారులు	567

15 రోజుల్లోగా అందరికీ డీడీలు

గొర్రెలను పంపిణీ చేయాలని, లేకుంటే కట్టిన డీడీలనైనా వెనక్కి ఇచ్చేయాలని గొల్ల, కుర్మలు గతేడాదిగా ఆందోళనలు చేస్తున్నారు. విషయాన్ని మా శాఖ రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా డీడీలను వారికిచ్చేయాలని ఆదేశించారు. ఈ మేరకు చర్యలు చేపట్టాం. నేటి నుంచి ప్రక్రియను ప్రారంభిస్తాం. 15 రోజుల్లోగా డీడీలు కట్టిన ప్రతి ఒక్కరికి తిరిగి ఇచ్చేస్తాం.

– బి.కిషన్, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



పల్లకిసేవలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్

బేల: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. మండలంలోని కాప్సి(బి) గ్రామంలో ఆధ్యాత్మిక గురువు నానాజీ మహరాజ్ గుడిపడ్వ పంచమి ఉత్సవ వేడుకల్లో ఆదివారం ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని సూచించారు. నానాజీ మహరాజ్ బోధనలు అనుసరణీయమని తెలిపారు. అనంతరం పల్లకీసేవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులోల ఆయా పార్టీల నాయకులు, ప్రధాన శిష్య బృందం, భక్తులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇద్దరి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలో ఇటీవల ఇద్దరు వ్యక్తులపై హత్యాయత్నానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ ఎస్సై ఉదయ్ కుమార్ తెలిపారు. పట్టణానికి చెందిన ముజాయిద్, షాహీద్‌పై కోలిపూరకు చెందిన ఫజిల్, అబ్దుల్ ఆసిల్ గురువారం కత్తులతో దాడికి పాల్పడి తీవ్రంగా గాయపర్చారు. బాధితుల ఫిర్యాదు మేరకు కోలిపూరకు చెందిన ఫజిల్, అబ్దుల్ ఆసిల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సెల్‌ఫోన్ దొంగ రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని తాటిగూడకు చెందిన సాయికుమార్ ఇటీవల సెల్‌ఫోన్ దొంగతనానికి పాల్పడి పరారీలో ఉండగా ఆదివారం పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు. కాలనీలోని ఓ ఇంట్లో మార్చి 25న తెల్లవారుజామున సెల్‌ఫోన్ చోరీ చేశాడు. దొంగతనానికి పాల్పడిన నిందితుడు పరారీలో ఉండగా ఆదివారం అరెస్టు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

జన్నారం: మండలంలోని టీజీపల్లి వద్ద అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. లక్సెట్టిపేట సీఐ నరేందర్‌కు వచ్చిన సమాచారం మేరకు పోలీసులను పంపించగా టీజీపల్లిలో బియ్యం లోడ్ చేస్తున్న వాహనం కనిపించింది. 20 క్వింటాళ్ల బియ్యంతో పాటు వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుడుంబా విక్రయిస్తే కఠిన చర్యలు

కోటపల్లి(చెన్నూర్): గుడుంబా విక్రయించినా తయారు చేసినా కఠినచర్యలు తప్పవని ఎస్సై రాజేందర్ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని ఆలుగామలో దాడులు నిర్వహించి 1200 లీటర్ల బెల్లంపాకం, 10లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గుడుంబా వల్ల కుటుంబాలు నాశనం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌పార్టీ, సీఆర్పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

అలరించిన అష్టావధానం


అష్టావధానంలో పాల్గొన్న కవులు

చెన్నూర్: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శతావధాని మారేపల్లి వెంకటపట్వర్ధన్ నేతృత్వంలో ఆదివారం నిర్వహించిన అష్టావధానం అలరించింది. కవులు, రచయితలు పాల్గొని కవితలు సంధించారు. శతావధాని పట్వర్ధన్ తనదైన శైలిలో సమాధానాలు చెప్పారు. కార్యక్రమంలో కవులు, రచయితలు జక్కెపల్లి నాగేశ్వర్‌రావు, మేకల రామస్వామి, దబ్బెట రాజమల్లు, మహవాది సుభాష్, బొడ్డు మహేందర్, వేదాంతం సురేశ్‌బాబు, భాగ్యలక్ష్మి, డాక్టర్ శంకర్‌లాల్ లాహోటి, కొమ్మెర రామ్మూర్తి, పద్మనాభాచా రి, కారెంగుల రామయ్య, పద్యాభిమానులు, తెలుగు భాషాభిమానులు పాల్గొన్నారు.

బెట్టింగ్ జోరు..!



- మంచిర్యాల జిల్లా కేంద్రంలో జోరుగా క్రికెట్ బెట్టింగ్‌లు
- చేతులు మారుతున్న లక్షలాది రూపాయలు
- బార్ అండ్ రెస్టారెంట్లు, లాడ్జీలే అడ్డా
- అంతా ఆన్‌లైన్‌లోనే..

మంచిర్యాలక్రైం: అన్నిరకాల క్రీడల్లో క్రికెట్ అంటే అందరికీ మక్కువ. చిన్నారుల నుంచి మొదలుకుని వృద్ధుల వరకు క్రికెట్ అంటే అభిమానమే. అదే అభిమానంతో ఐపీఎల్ క్రికెట్‌పై యువత నుంచి మొదలుకుని మధ్య వయస్సు వారు సైతం ఆన్‌లైన్ బెట్టింగ్ పెడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని కొన్ని బార్ అండ్ రెస్టారెంట్‌లు, లాడ్జీలను అడ్డాగా చేసుకుని మందు, విందు పార్టీలు ఏర్పాటు చేసుకుని క్రికెట్ చూసుకుంటూ బాల్ టూ బాల్.. వికెట్ టూ వికెట్ అంటూ బెట్టింగ్‌లు పెడుతున్నారు. మరికొందరు రహస్య ప్రాంతాల్లో ఒకేచోట గుమిగూడి సెల్‌ఫోన్లలో క్రికెట్ వీక్షిస్తూ ఆన్‌లైన్ బెట్టింగ్‌లు పెడుతున్నారు. ఇంట్లోనే ఉండి టీవీల ముందు కూర్చుని ఆన్‌లైన్ ద్వారానే బెట్టింగ్ కడుతున్నారు. పల్లెలు మొదలుకుని పట్టణాల వరకు యువత టీవీలు, సెల్‌ఫోన్లకు అతుక్కుపోతున్నారు. ఈ సంస్కృతి కొన్నేళ్లుగా మంచిర్యాల జిల్లా కేంద్రంలోనూ పట్టణాలు, పల్లెల్లోనూ చాపకింద నీరులా విస్తరిస్తోంది. బాల్ టూ బాల్.. వికెట్ టూ వికెట్ అంటూ రూ.100 నుంచి బెట్టింగ్ ప్రారంభిస్తారు. రోజూ ఒక్కో మ్యాచ్‌పై సుమారు రూ.1000 నుంచి ప్రారంభమై రూ.లక్షల్లో బెట్టింగ్ సాగుతోంది. అంతేకాకుండా బార్ అండ్ రెస్టారెంట్లలో పెద్దపెద్ద స్క్రీన్లు ఏర్పాటు చేసి మ్యాచ్ వీక్షించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు సమాచారం.

ఐపీఎల్ అంటేనే బెట్టింగ్ గేమ్

నేడు క్రికెట్ ఆట అంటే అన్ని వర్గాల ప్రజలకు ఎంతో అభిమానం. దీన్ని ఆసరాగా మల్చుకుని కొందరు వ్యాపారం చేస్తున్నారు. కమీషన్లు తీసుకుంటూ బూకీలుగా మారుతున్నారు. ఆన్‌లైన్ ద్వారా బెట్టింగులు నడిపిస్తూ రెండు వర్గాల తరుపున మధ్యవర్తిత్వం చేసి అందిన కాడికి దండుకుంటున్నారు. గూగుల్‌పే, పేటీఎం ద్వారా సులభంగా మనీ ట్రాన్స్‌ఫర్ చేసుకునే అవకాశం ఉన్నందువల్ల ఆన్‌లైన్ ద్వారా లావాదేవీలు జరుపుతున్నారు. గతంలో జిల్లా కేంద్రంలో ఇలాంటి సంఘటనలు వెలుగుచూశాయి. మ్యాచ్‌లు ప్రారంభమైనప్పటి నుంచి ఆడేది ఎవరైనా సరే తమకు నచ్చిన ఆటగాళ్ల గెలుపు ఓటమిపై తమకున్న ఆలోచన విధానంతో బెట్టింగులు పెడుతున్నారు.

యువత పెడదారి..

ఆన్‌లైన్ బెట్టింగ్‌ల ద్వారా యువత పెడ దారి పడుతోంది. గతంలో ఐపీఎల్ బెట్టింగ్‌లు జరిపిన వారే మళ్లీ రంగలోకి దిగినట్లు తెలుస్తోంది. గతంలో జిల్లా కేంద్రంలోని ఓ వార్డులో ఇంట్లో క్రికెట్ బెట్టింగ్ జోరుగా సాగుతోందన్న సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. జిల్లాలో క్రికెట్ బెట్టింగ్‌లో జోరుగానే సాగుతున్నట్లు సమాచారం. ఇప్పటికైనా పోలీసులు స్పందించి బెట్టింగ్ రాయుళ్లపై చర్యలు తీసుకోవాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

- జిల్లా కేంద్రంలోని ఓ కాలనీకి చెందిన యువకుడు ఉన్నత చదువు నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లాడు. అక్కడ స్నేహితులతో కలిసి క్రికెట్ బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్స్‌కు పాల్పడి ఇంట్లో తల్లిదండ్రులకు తెలియకుండా రూ.3లక్షలు అప్పు చేశాడు. విషయం తెలిసిన తల్లిదండ్రులు కొడుకును మందలిస్తే ఆత్మహత్య చేసుకుంటాడేమోనని భయపడి అతను చేసిన అప్పు తిరిగి చెల్లించారు.
- 2023 నవంబర్ 15న ఇండియా వర్సెస్ న్యూజిలాండ్ మ్యాచ్ నడుస్తుండగా మంచిర్యాలకు చెందిన ఓ సింగరేణి ఉద్యోగి కుమారుడు ఇంట్లో నుంచి రూ.50 వేలు తీసుకెళ్లి బెట్టింగ్‌కు పాల్పడ్డాడు. విషయం ఇంట్లో తెలియడంతో మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించగా కుటుంబ సభ్యులు గమనించి కాపాడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కానీ ఈ విషయం పోలీసుల దృష్టికి వెళ్లలేదు.

పలువురిపై కేసు నమోదు

నిర్మల్‌టౌన్: ఐపీఎల్ బెట్టింగ్ ఆడిన వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో వివరాలు వెల్లడించారు. జిల్లా కేంద్రానికి చెందిన మణికంఠ, చిలమంతుల శివచారి భైంసాకు చెందిన రెహమాన్ ద్వారా ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్, ఐడీ క్రియేట్ చేసుకున్నారు. డబ్బులను కైన్లుగా మార్చి యూజర్ ఐడీలో పెట్టి బెట్టింగ్ ఆడుతున్నామని కస్టమర్లకు చెప్పారు. కస్టమర్లకు కూడా ఐడీ క్రియేట్ చేసి ఆడిపిస్తామని తెలిపారు. పక్కా సమాచారం మేరకు పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.14,170 నగదు, 4 ఫోన్లు, 1 ఏటీఎం కార్డు స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో పట్టణ సీఐ అనిల్ కుమార్ పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

ప్రమాదవశాత్తు చుక్కల దుప్పి మృతి


మృతి చెందిన చుక్కల దుప్పి

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని గోలేటి టౌన్‌షిప్‌లో గల భీమన్న స్టేడియం సమీపంలో ఆదివారం తెల్లవారు జామున ప్రమాదవశాత్తు చుక్కల దుప్పి మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం అటవీ ప్రాంతం నుంచి బయటకు వచ్చిన చుక్కల దుప్పిని వేటకుక్కలు వెంబడించడంతో స్టేడియం వైపు పరుగులు తీసింది. ఈ క్రమంలోఇనుప ఫెన్సింగ్ పై నుంచి దూకే క్రమంలో వైర్ల మధ్యలో పడి మృతి చెందింది. వాకర్లు దుప్పిని గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. దుప్పి కళేబరాన్ని గోలేటి వన్ అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బీట్ అధికారులు రవి, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

రైలులో మహిళ మృతి


మృతి చెందిన లక్ష్మీదేవి

మంచిర్యాలక్రైం: రైలులో ప్రయాణిస్తున్న ఓ మహిళ అనారోగ్యంతో మృతి చెందినట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్ తెలిపారు. కడప జిల్లా శాంత కొవ్వూర్ గ్రామానికి చందిన పడమటింటి లక్ష్మీదేవి(36)కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో ఈ నెల 12న సోమగూడెం కల్వరి చర్చికి కుటుంబ సభ్యులతో వచ్చింది. 13, 14న ప్రార్థనలు ముగించుకుని స్వగ్రామానికి గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లో వెళ్తుండగా మందమర్రి సమీపంలో తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందింది. జీఆర్పీ పోలీసులు మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

తేనెకోసం వెళ్లి ఒకరు మృతి


రాజేందర్(ఫైల్)


పెంబి: కుటుంబ పోషణకు తేనె సేకరణకోసం వెళ్లి ఒక రు మృతి చెందిన సంఘట న మండలంలో చోటు చే సుకుంది. ఎస్సై శంకర్ తెలి పిన వివరాల ప్రకారం మండలంలోని మందపల్లి గ్రా మానికి చెందిన నెముల్ల రాజేందర్ (35)అదే గ్రా మానికి చెందిన బొజ్జ రాజన్న, బొజ్జ భీమన్న, దేశవే జి పెద్దులుతో కలిసి శనివారం రాత్రి సబ్‌స్టేషన్ వద్ద ఉన్న రావిచెట్టుపై తేనె తీసేందుకు వెళ్లారు. చెట్టు కొ మ్మ విరిగి కిందపడడంతో తీవ్ర రక్త స్రావం జరిగి అ క్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్ద రు కుమారులు ఉన్నారు. భార్య నముల్ల గంగవ్వ ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య


వెంకటేశ్వర్లు (ఫైల్)

మంచిర్యాలక్రైం: ఈ నెల 13న గుర్తు తెలియని రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ సంపత్‌కుమార్ తెలిపారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్‌కు చెందిన ఇల్లందుల వెంకటేశ్వర్లు (34) మంచిర్యాలలోని బంధువుల ఇంటికి వచ్చాడు. స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్యకు యత్నించగా తీవ్ర గాయాలపాలయ్యాడు. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతునికి భార్య శ్రీలేఖ, కూతురు అక్షర, కుమారుడు మణికరణ్ ఉన్నారు. శ్రీ లేఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య


మల్లేశ్ (ఫైల్)

బెల్లంపల్లి: మద్యానికి బానిసైన ఒకరు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు బెల్లంపల్లి జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ కె.సురేష్‌గౌడ్ తెలిపారు. కాసిపేట మండలం పెద్దనపల్లి గ్రామానికి చెందిన బన్న మల్లేశ్ (49)కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం తెల్లకల్లు తాగేందుకు ఇంట్లో నుంచి బయలుదేరాడు. మందమర్రి-కల్వరీ చర్చి మధ్యలో గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి తల్లి బానమ్మ , భార్య ఇందుమతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మంచిర్యాల జీఆర్పీ ఎస్సై సుధాకర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

తండ్రి చితికి నిప్పంటించిన కూతురు

కాసిపేట: మండలంలోని సోమగూడెం పాతబస్తీకి చెందిన బన్న మల్లేశ్ ఆదివారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి ఇద్దరు కుమార్తెలు సంతానం. రాత్రి అంత్యక్రియలు నిర్వహించగా పెద్ద కూతురు రేష్మా తండ్రి చితికి నిప్పు పెట్టి అందర్నీ కంటతడి పెట్టించింది.


నిప్పు పట్టుకున్న రేష్మా

నగదు పట్టివేత


పట్టుబడిన నగదుతో ఎస్సై రాములు

నేరడిగొండ(బోథ్): బోథ్ మండలంలోని ఘన్‌పూర్ చెక్‌పోస్టు వద్ద ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో రూ.85 వేల నగదు పట్టుకున్నట్లు ఎస్సై రాములు తెలిపారు. మహారాష్ట్రలోని యవత్మాల్ జిల్లా డిగ్రస్ గ్రామానికి చెందిన పాండురంగ్ తన ఆటో ఫైనాన్స్ కట్టడానికి రూ.85 వేలు వెంట తీసుకుని నిజామాబాద్ వైపు వెళ్తున్నాడు. నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. తనిఖీల్లో ఎఫ్ఎస్‌టీ టీం సభ్యులు ప్రమోద్‌రెడ్డి, ఏఎస్సై గంగారెడ్డి, కానిస్టేబుళ్లు నాగు, శేషురావు, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

నగదు పట్టివేత

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని వంజీరి చెక్‌పోస్టు వద్ద ఆదివారం నిర్వహించిన వాహనాల తనిఖీలో రూ.1,80,000 నగదు పట్టుబడినట్లు ఎస్సై సోనియా తెలిపారు. నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకుని ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అప్పగించినట్లు పేర్కొన్నారు.

ఇసుక లారీ పట్టివేత

తాండూర్: ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు ఎస్సై జగదీశ్వర్ గౌడ్ తెలిపారు. ఆదివారం రెబ్బెన మండలం నుంచి మంచిర్యాలకు ఇసుక లోడుతో వెళ్తున్న లారీని బోయపల్లి గ్రామ శివారులో పట్టుకున్నారు. అనుమతి పత్రాలు, బిల్లులు లేకపోవడంతో లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మట్కారాయుళ్ల అరెస్ట్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని దివ్య లాడ్జిలో ఆన్‌లైన్‌లో మట్కా ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ భన్సీలాల్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు ఆదివారం లాడ్జిపై దాడి చేసి బెల్లంపల్లి టేకులబస్తీకి చెందిన నేర్ల రవికుమార్, దువ్వె నితీష్, కల్లపెల్లి శశి, దేవరకొండ సతీష్‌లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.2వేల నగదు, 4 సెల్‌ఫోన్లు, మట్కా చార్ట్స్ స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

గంజాయి పట్టివేత


పోలీసుల అదుపులో నిందితులు

నార్నూర్: గాదిగూడ మండలంలోని లోకారి(బి)లో ఆదివారం ఎస్సై మహేష్ కుమార్ ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించారు. గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తుల వద్ద నుంచి రూ.30వేల విలువచేసే 1.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ గౌస్ ఆలం, ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్, సీఐ రహీంపాషా ఆదేశాల మేరకు గంజాయిపై ప్రత్యేక ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత అందరిది


ఇంద్రవెల్లిలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క

ఇంద్రవెల్లి(ఖానాపూర్): మనకు అన్ని విధాలుగా హక్కులు కల్పించిన రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత మనందరిపై ఉందని గిరిజన సంక్షేమ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన అంబేడ్కర్ 133వ జయంతి వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాజ్యాంగమే మనకు రక్ష అన్నారు. కొన్ని పార్టీలు రాజ్యాంగాన్ని మార్చడానికి కుట్ర పన్నుతున్నాయన్నారు. అలా జరిగితే బడుగు, బలహీనవర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోతారన్నారు. అలాంటి పార్టీలకు దూరంగా ఉండాలన్నారు. ప్రతిఒక్కరూ అంబేడ్కర్ చూపిన మార్గంలో నడవాలన్నారు. ఆ మహనీయుడి ఆశయసాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్, ప్రధాన కార్యదర్శి వాగ్మారే కాంరాజ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, నాయకులు ఎండీ మసూద్, జహీర్, సోమోరే నాగోరావ్, జితేందర్, ఆచారే దత్త, తదితరులు పాల్గొన్నారు.

దేశానికి దిక్సూచి అంబేడ్కర్

ఉట్నూర్‌రూరల్: దేశానికి దిక్సూచి బీఆర్ అంబేద్కర్ అని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మండల కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో మంత్రి సీతక్క, ఎంపీ అభ్యర్థి సుగుణతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత, ప్రజా సంఘాలు, బహుజన సంఘాల నాయకులు ఖయ్యూం, చంద్రయ్య, సలీం, లాజర్, ఎక్బాల్, చంద్రభాన్, దూట రాజేశ్వర్, సులోచన, రాధాబాయి, తదితరులు పాల్గొన్నారు. లక్కారంలో దళిత శక్తి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మాజీ సర్పంచ్ మర్సుకోల తిరుపతి పాల్గొన్నారు. పంచశీలచౌక్ వద్ద నిర్వహించిన వేడుకల్లో జయచంద్ర, సాదిక్, కలీం, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆదర్శప్రాయుడు

- జీఎం సంజీవరెడ్డి


విగ్రహానికి పూలమాలలు వేస్తున్న జీఎం

శ్రీరాంపూర్(మంచిర్యాల): అంబేద్కర్ ఆదర్శప్రాయుడని శ్రీరాంపూర్ జీఎం బీ.సంజీవరెడ్డి అన్నారు. ఆదివారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్ద అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. ఇటీవల నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ బాజీసైదా, అధికారుల సంఘం బ్రాంచ్ కార్యదర్శి చంద్రశేఖర్, ఏరియా ఎస్ఓటూ జీఎం పురుషోత్తంరెడ్డి, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, డీజీఎం (సివిల్) ఆనంద్ కుమార్, ఎస్సీ లైజనింగ్ అధికారి కిరణ్ కుమార్, ఎస్టీ లైజనింగ్ అధికారి రాము, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు ప్రవీణ్, ఎన్ కుమార్, రాజు పాల్గొన్నారు.

ఎస్టీపీపీలో...

జైపూర్: మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీపీపీ ఆడిటోరియం నుంచి పెగడపల్లి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎస్టీపీపీ సీటీసీ బసివిరెడ్డి వోఅండ్ఎం చీఫ్ జెన్‌సింగ్, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షులు దరావత్ పంతులానాయక్, అధికారులతో కలిసి పెగడపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆడిటోరియంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షురాలు భవాని, ఎస్టీపీపీ ఏజీఎంలు సుధాకర్, ప్రసాద్, రమణ, మదన్మోహన్, ఎస్సీ లైసెనింగ్ అధికారి వెంకటయ్య, ఎస్టీ లైసెనింగ్ అధికారి భీమా, సీఎంవోఏఐ అధ్యక్షులు సముద్రాల, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కోల్‌కారిడార్ ఏర్పాటుకు కృషి



మాట్లాడుతున్న జనక్ ప్రసాద్

శ్రీరాంపూర్: సింగరేణి ప్రాంతాలను కలుపుతూ కోల్‌కారిడార్‌ను ఏర్పాటు చేస్తామని ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ బీ.జనక్‌ప్రసాద్ తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణిలో కొత్త గనుల ఏర్పాటు కోసం ఇప్పటికే తమ యూనియన్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, డెప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కోల్ సెక్రెటరీ మీరాను కలిశామన్నారు. సమావేశంలో ఆ యూనియన్ బ్రాంచి ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్ రావు, జాతీయ సమితి సభ్యులు సీహెచ్ భీంరావు, కేంద్ర కమిటీ ఉపాధ్యక్షులు గరిగే స్వామి, కలవేన శ్యాం, నాయకులు తిరుపతి, వెంగళ కుమారస్వామి, ల్యాగల శ్రీనివాస్ పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి తిరిగిరాని లోకాలకు..

- విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి


రాజేశ్(ఫైల్)

జన్నారం: చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజవర్ధన్, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం జన్నారం మండలం ఇప్పలపల్లి గ్రామానికి చెందిన తాళ్లపెల్లి రాజేశ్ (28) ఆదివారం సెలవుదినం కావడంతో తన స్నేహితులతో కలిసి చేపలు పట్టేందుకు సమీపంలోని గోదావరి వద్దకు వెళ్లారు. చేపలు పట్టే క్రమంలో రాజేశ్ విద్యుత్ వైర్ జాయింట్ చేస్తూ నీటిలో దిగుతుండగా బెడద కృష్ణయ్య విద్యుత్ మోటర్ స్టార్టర్‌లో వైర్లు పెట్టి ఆన్ చేశాడు. ఈ క్రమంలో రాజేశ్ విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. మృతునికి భార్య తేజస్విని, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. తేజస్విని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. విషయం తెలుసుకున్న లక్సెట్టిపేట సీఐ అల్లం నరేందర్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

కిష్టాపూర్‌లో శ్రీరాముని తలంబ్రాలు


కిష్టాపూర్‌లో గోటితో శ్రీరామ తలంబ్రాలు ఒలుస్తున్న మహిళలు

జైపూర్: మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో ఛత్రపతి శివాజీ సేన ఆధ్వర్యంలో శ్రీరామ తలంబ్రాలను గోటితో ఒలిచే కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు ఆలయం వద్ద సీతారాముల కల్యాణానికి ఉపయోగించే తలంబ్రాలను గోటితో ఒలిచారు. కార్యక్రమంలో శివాజీ సేన నాయకులు మంతెన ఉదయ్‌కిరణ్, గణేశ్, మనోహర్‌రెడ్డి, రవితేజ, వేముల సాయికిరణ్, చిట్టిరెడ్డి సుజాత, మల్ల సౌజన్య, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్ ద్వారా తాగునీటి సరఫరా

సాక్షి ఎఫెక్ట్..

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయంలో నెలకొన్న నీటి సమస్యపై 'ఇంద్రాదేవి ఆలయం.. సమస్యల మయం' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆదివారం భక్తులు భారీ సంఖ్యలో రావడంతో గ్రామ పంచాయతీ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఇంద్రాదేవి ఆలయానికి సందర్శించి నీటి సమస్యపై ఆరా తీశారు. ట్యాంకర్ ద్వారా భక్తులకు నీటిని సరఫరా చేశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ భానుకుమార్, ఎంపీవో జీవన్, భక్తులు పాల్గొన్నారు.

